## కేంద్ర బలగాల తనిఖీ

భీమారం, అక్టోబర్ 30 : మంచిర్యాల-చెన్నూర్ రహదారిపై కేంద్ర బలగాలు సోమవారం ముమ్మర తనిఖీలు నిర్వహించాయి. మహారాష్ట్రతో పాటు మంచిర్యాల వైపు నుంచి వస్తున్న అన్ని వాహనాలను పరిశీలించాయి. దీంతో మండల వ్యాప్తంగా చర్చగా మారింది. డబ్బు ఏమైనా తరలిస్తున్నారా అనే కోణంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రతి రోజూ తనిఖీలు ఉంటాయని ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఐ శకుంతల, పోలీసులు అసంపల్లి కిరణ్ పాల్గొన్నారు.

## ఓటరు నమోదుకు చివరి రోజు

హాజీపూర్, అక్టోబర్ 30 : ఓటు హక్కు నమోదుకు మంగళవారం చివరి రోజు అని ఓటరు నమోదు అధికారి, ఆర్డీవో రాములు తెలిపారు. అక్టోబర్ 10వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు తప్పకుండా నమోదు చేసుకోవాలని కోరారు.

## విజిలెన్స్ వారోత్సవాలు ప్రారంభం

శ్రీరాంపూర్, అక్టోబర్ 30 : శ్రీరాంపూర్ ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లు, ఓసీపీపై సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీరాంపూర్ ఓసీపీపై ప్రాజెక్టు ఆఫీసర్ పురుషోత్తంరెడ్డి ప్రారంభించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. అవినీతి రహిత సింగరేణిగా మార్చుకోవడానికి ప్రతీ ఉద్యోగి, కార్మికుడు, అధికారి కృషి చేయాలని కోరారు. సేఫ్టీ ఆఫీసర్ శ్రీనివాస్, ఈఈ చంద్రశేఖర్, ఫిట్ కార్యదర్శి కందుల శంకరయ్య, ఈఈ శ్యాంసుందర్‌రావు, సారంగపాణి, సర్వే ఆఫీసర్ సంపత్, సీనియర్ పీవో శంకర్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిబంధనలు పాటించాలి

కన్నెపల్లి, అక్టోబర్ 30 : ప్రజలందరు ఎన్నికల నిబంధనలు పాటించాలని, ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని తాండూర్ సీఐ శ్రీనివాస్, కన్నెపల్లి ఎస్ఐ నరేష్‌లు సూచించారు. సోమవారం జన్కాపూర్ గ్రామంలో ప్రజలకు ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎన్నికల విషయంలో ఏమైనా సందేహాలుంటే సీ విజిల్, సువిధ యాప్‌ల ద్వారా ఫిర్యాదులుచేయవచ్చని తెలిపారు. ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## ఎన్నికల నియమావళిపై అవగాహన

దండేపల్లి, అక్టోబర్ 30 : దండేపల్లి మండల కేంద్రంలో సోమవారం మండల ఇన్‌చార్జ్ సీఐ ప్రవీణ్‌కుమార్ ఎన్నికల నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల యాప్‌పై వివరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎస్ఐ ప్రసాద్, పోలీస్ సిబ్బంది, యువజన సంఘాల సభ్యులు, ప్రజలు తదితరులు ఉన్నారు.

## ఎల్ఎల్‌బీలో రెండు గోల్డ్ మెడల్స్

కాసిపేట, అక్టోబర్ 30 : దేవాపూర్‌కు చెందిన గడ్డం మేఘన ఉస్మానియా యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీలో టాపర్‌గా నిలిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించింది. 2021-2022 సంవత్సరానికి గాను ఎల్ఎల్‌బీలో డిస్టింక్షన్‌లో టాపర్‌గా నిలవడంతో యూనివర్సిటీ స్థాయితో పాటు మహిళా విభాగంలో జస్టిస్ తడకమల్ల నర్సింగరావు మెమోరియల్ గోల్డ్ మెడల్, రుద్ర రాజు చంద్ర మహాలక్ష్మీ అండ్ శ్రీదువ్వూరి నర్సరాజు మెమోరియల్ గోల్డ్ మెడల్ సాధించింది. ఈ మేరకు మంగళవారం ఠాగూర్ ఆడిటోరియంలో ఉస్మానియా యూనివర్సిటీ కాన్విక్షన్ కార్యక్రమంలో ఈ మెడల్స్‌ను మేఘన అందుకోనున్నది. మేఘన తండ్రి గడ్డం పురుషోత్తం మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఉద్యోగి. మేఘన దేవాపూర్ కార్మెల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్ హైదరాబాద్, డిగ్రీ, పీజీ కరీంనగర్‌లో పూర్తి చేసింది. ఎల్ఎల్‌బీ ఉస్మానియా యూనివర్సిటీలో టాపర్‌గా నిలిచింది. పీజీ లాసెట్ ఎంట్రెన్స్‌లో కూడా గతేడాది రాష్ట్ర స్థాయి మూడో ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ఎల్ఎల్ఎం ఫస్టియర్ పూర్తి చేసి రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టింది.

# పని చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

- లక్షెట్టిపేట మున్సిపల్ చైర్మన్ కాంతయ్య
- 8వ వార్డులో ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

లక్షెట్టిపేట, అక్టోబర్ 30 : పని చేసే, అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడం ప్రజల బాధ్యత అని మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య అన్నారు. మున్సిపాలిటీలోని 8వ వార్డులో సోమవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల పాలనలో తెలంగాణ వెనుకబడిపోయిన విషయం అందరూ చూశారని గుర్తుచేశారు. రైతులు, మహిళలు, వృద్ధులు, వికలాంగుల కోసం చేసిందేమీలేదన్నారు. కానీ తెలంగాణ ప్రభుత్వం వచ్చాక అన్ని విధాలా అండగా నిలిచారని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో అమలవడంలేదన్నారు. ప్రజల సంతోషమే తన సంతోషంగా పనిచేసే సీఎం కేసీఆర్ ఉంటేనే అన్ని విధాలా న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేసి మంచిర్యాల బీఆర్ఎస్ అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందిస్తూ ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, కో-ఆప్షన్ సభ్యుడు నూనె ప్రవీణ్, నాయకులు అంకతి కిషన్, శంకర్‌రావు, ముష్కం రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు..

సీసీసీ నస్పూర్, అక్టోబర్ 30 : నస్పూర్ ఇందిరమ్మకాలనీకి చెందిన మాజీ ఎంపీటీసీ ఆకుల రజితానరేందర్ దంపతులు, కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి సోమవారం మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి అరవిందరెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపుకోసం కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నస్పూర్ పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కౌన్సిలర్ బండి పద్మ, మాజీ సర్పంచ్ వేల్పుల రాజేశ్, బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు రౌతు రజిత, నాయకులు అడ్లకొండ రవిగౌడ్, రౌతు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో చేరిన వారితో గడ్డం అరవిందరెడ్డి

## స్వేచ్ఛగా ఓటువేయాలి



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 30 : ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పోలీసులు, అధికారులు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా చెన్నూర్ పట్టణంలోని ప్రధానవీధుల్లో సీఐ వాసుదేవరావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించేందుకు, తామున్నామని భరోసా కల్పిస్తూ కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ఈ పోలీసుల కవాతు పట్టణంలోని అయ్యప్ప దేవాలయం నుంచి ప్రారంభమై కొత్తగూడెం కాలనీ, అంబేద్కర్ చౌరస్తా, గాంధీ చౌక్, శివాలయం, జెండావాడ, బొక్కల గూడెం, చాకలివాడ, లైన్ గడ్డ నుంచి పోలీస్ స్టేషన్ వరకు సాగిందని సీఐ వివరించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) దత్తు, మంచిర్యాల డీసీపీ కేకన్ సుధీర్ రామనాథన్, జైపూర్ ఏసీపీ బీ మోహన్, చెన్నూర్ పట్టణ సీఐ ఎస్ వాసుదేవరావు, శ్రీరాంపూర్ సీఐ రమేశ్ బాబు, కోటపల్లి సీఐ విద్యాసాగర్ రావు, సీఆర్‌పీఎఫ్ ఆర్ఐ జానకి, జైపూర్ సబ్ డివిజన్ సీఐలు, ఎస్ఐలు, రెవెన్యూ అధికారులు, సివిల్, సీఆర్‌పీఎఫ్‌తోపాటు టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి



కోటపల్లి : ప్రచార సామగ్రితో కోఆప్షన్ సభ్యుడు మోహియొద్దీన్

కోటపల్లి, అక్టోబర్ 30 : బీఆర్ఎస్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్ మోహియొద్దీన్ అన్నారు. కోటపల్లి మండలంలోని ఎదుల్లబంధం సమీపంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాలు, ప్రచార సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు అజ్గర్ మోహియొద్దీన్ మాట్లాడుతూ.. చెన్నూర్‌లో బాల్క సుమన్ గెలుపును, రాష్ట్రంలో కేసీఆర్ హ్యాట్రిక్‌ను ఎవ్వరూ ఆపలేరన్నారు. నాగంపేటలో పీఏసీఎస్ చైర్మన్ పెద్దపోలు సాంబాగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో పత్రాలను ఇంటింటా తిరిగి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తం, సాదిక్, గంట శేఖర్ గౌడ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

### చెన్నూర్‌లో ప్రచారం..

చెన్నూర్ రూరల్ అక్టోబర్ 30 : చెన్నూర్ మండలం సుబ్బరాంపల్లి, లంబాటిపల్లి, నాగాపూర్ ఒత్కులపల్లి, నాగాపూర్, కిష్టంపేట, కొమ్మెర, పొక్కూర్, ముత్తరావుపల్లి కత్తరశాల గ్రామాలోల బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలను వివరించారు. నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, సంక్షేమ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలని సూచించారు. సర్పంచులు అయిత పార్వతి, బుర్ర రాకేష్ గౌడ్, మాడ సుమలత, నాయకులు అయిత సురేశ్ రెడ్డి, మాడ మాధవ రెడ్డి పాల్గొన్నారు.

## పరీక్ష నిర్వహణపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న సెక్టోరల్ అధికారులు

కాసిపేట, అక్టోబర్ 30 : సీస్ స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వేపై నిర్వహించే పరీక్షకు కాసిపేట, తాండూర్ మండలాలకు సంబంధించి నిర్వహణకు ఇన్విజిలేటర్లుగా ఎంపికైన ఇంటర్ విద్యార్థులకు సోమవారం కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ కళాశాలలో శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి మాట్లాడారు. 3,6,9 తరగతుల విద్యార్థులకు నవంబర్ 3న విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలపై పరీక్ష ఉంటుందన్నారు. పరీక్ష నిర్వహించేదుకు ఎంపికైన మోడల్ కళాశాల ఇంటర్ విద్యార్థులు అవగాహన పెంచుకొని, పూర్తి స్థాయిలో పరీక్ష నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాసిపేట, తాండూర్ మండలాల ఎంఈవో వాసాల ప్రభాకర్, మండల నోడల్ అధికారి నెన్నెల లచ్చయ్య, మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, మందమర్రి మోడల్ కళాశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, సీసీవో రాంబాబు, సీఆర్‌పీలు, ఇన్విజిలేటర్లుగా ఎంపికైన 61 మంది ఇంటర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బెటాలియన్‌లో ఓపెన్ హౌస్



విద్యార్థులకు ఆయుధాల గురించి వివరిస్తున్న కమాండెంట్

హాజీపూర్, అక్టోబర్ 30 : పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా హాజీపూర్ మండలం గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన అభ్యాస పాఠశాల, మౌంట్ కార్మెల్ పాఠశాల విద్యార్థులకు ఆయుధాల పనితీరుపై వివరించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సయ్యద్ జమీల్ బాషా, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, బెటాలియన్ అధికారులు శ్యామ్ కుమార్, స్వామి, గోపి, మారుతి, రవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని యువకుడికి గాయాలు

తాండూర్, అక్టోబర్ 30 : మండల కేంద్రంలోని బోయవాడకు చెందిన బోగి సాయి సోమవారం ఉదయం తాండూర్ బస్టాండ్ వైపు వెళ్తూ మధ్యలో ఉన్న రైల్వే ట్రాక్ దాటుతుండగా, ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో కుడి కాలికి తీవ్రగాయాలయ్యాయి. ట్రాక్ మధ్యలోనే పడి ఉండడాన్ని అటువైపు వచ్చిన వారు గమనించి వెంటనే తాండూర్ ఎస్‌ఐకి సమాచారం అందించారు. బస్టాండ్ ఏరియాకు చెందిన సంపత్, తాండూర్‌కు చెందిన పెద్ద బోయిన భీమేశ్ సాయంతో సాయిని రైల్వే ట్రాక్ నుంచి పక్కకు తీసుకువచ్చారు. అప్పటి వరకు డౌన్ ట్రాక్‌పై వచ్చిన గూడ్స్ రైలు నిలిచిపోయింది. రైల్వే అధికారులు, స్టేషన్ మాస్టర్‌తో సహా పలువురు సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. యువకుడిని పక్కకు తొలగించడంతో గూడ్స్ రైలు యథావిధిగా వెళ్లిపోయింది. తాండూర్ గ్రామం బోయవాడకు చెందిన సాయి ట్రాక్టర్ డ్రైవర్ బోగి రాజం కుమారుడని తెలియగా, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబీకులు, స్థానికుల సాయంతో బెల్లంపల్లి సర్కారు దవాఖానకు తరలించారు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.